# డబ్బుకోసం బైరాగి చిట్కాలు

వేదుల కామేశ్వరరావు

"ధనమూల మిదం జగత్" అనే సామెతను బట్టి, ఈ లోకంలో జీవిస్తున్నాననుకొనే ప్రతీ వ్యక్తికీ ధనం అనే పదార్థం జీవితావసరాలలో మొట్టమొదటిది. సదరు ధనం, దాని భావాలు, దాన్ని సంపాదించడానికి కావలసిన పరిస్థితులు, అది ఖర్చు అవటానికి ఏర్పడే వాతావరణం, దాన్ని ఖర్చుపెట్టగలిగిన ఉదార స్వభావాలు, అది చేత్తో పట్టుకొనికూడా నరకంలోకి తీసుకుపోవాలనుకొనే అభాగ్యుల లోభత్వాలు మొదలైన విషయాలమీద మా చర్చ సాగుతోంది. ఆదివారం. సెలవురోజు. పని ఆట్టే లేదు. అందుకనే చర్చలో అధికసంఖ్యాకులు జీతంచాలని ఉద్యోగస్థులూ, జీతమే లేని నిరుద్యోగస్థులున్ను. "డబ్బు" అనే రెండక్షరాలు చెవిలో పడగానే నోరూరుతుంది. డబ్బుని మనం తినం. కాని ఆ డబ్బు వేటినో మనచేత తినిపిస్తుంది. అందుకే "డబ్బు" అనే రెండక్షరాలు చెవిలో పడగానే నోరూర్తుంది. శరీరంలో ఆరోగ్యకరకమైన శక్తి ప్రవేశిస్తుంది. అందుకే డబ్బున్నవాడికి డబ్బులేనివాడు లోకువ. డబ్బున్నవాడికి సంఘంలోనూ, సంస్థలలోనూ లభించే ఆదరణకాని అధికారంకాని డబ్బులేని వాడికి లభించదు. అందుకనే ఆ డబ్బుయొక్క విలువను గురించి మా చర్చ సాగుతోంది. చర్చకు చాలామంది తమతమ ప్రతిపాదనలతోను, ఉపన్యాసాలతోను, సలహాలతోను హాజరయ్యారు.

అక్కడక్కడ ముక్కలులేని ఒక పాత బల్లచుట్టూ నాలుగు కుర్చీలు, కుర్చీ కిద్దరుచొప్పున సభ్యులు. సభ్యులందరి చేతుల్లోనూ కాగితాలు. బల్లమీద రెండు బీడీ కట్టలు, ఒక డక్కన్ సిగరెట్టుపెట్టె. కాగితాలు ఎగిరిపోకుండా వుండటానికని ఒక చిన్నరాయి. రాయిప్రక్కన ఒక టీ కెటెల్. కెటెల్ ప్రక్కన ఒక గాజుగ్లాసు. బల్లకు దూరంగా ఒక మంచినీళ్ళ కూజా. ఇలా వుంది మా చర్చగది. అవసరమైనప్పుడల్లా, ప్రతీవాడూ కాస్త టీనో, మంచినీళ్ళో త్రాగటం, ఒక బీడీనో, సిగరెట్టో అంటించడంతో చర్చ మంచి వేడిగా సాగుతోంది...

"ఈ విశ్వమానవ ప్రపంచంలో..."

"ఆగండి! ఇది మానవ ప్రపంచం అనడంకన్నా, రాక్షస ప్రపంచం అంటే బాగుంటుంది."

"అబ్బ నన్ను మాట్లాడనివ్వరా సుబ్బులూ! అధ్యక్షా, ఆంధ్ర సోదర మహాశయులారా!"

"ఒరేయ్! మన సభకు అధ్యక్షుడు లేడని తెలియదురా శంకరం నీకు?"

"అబ్బబ్బ! ఈ పూటకి మన సదాశివం అధ్యక్షుడుగా వుంటాడురా!"

"కారణం?"

స్కెచ్

"కారణం ఏముంది? మనందరం కుర్చీ కిద్దరు చొప్పున కూర్చొన్నాం. వాడు ఒక్కడూ ఒక కుర్చీలో కూర్చొన్నాడు. అందుకే వాడికధ్యక్ష స్థానం ఇస్తే మంచిదనుకొన్నాను."

"మహా గొప్పగా అనుకొన్నావులే! పిప్పళ్ళ బస్తాలా లావుగా వున్నాడు గనుక వాడొక్కడూ ఒక కుర్చీలో కూర్చున్నాడు. ఎవడైనా అందులోకి వెడితే నలిపేస్తాడేమోనని వాడి కుర్చీవైపెవ్వడూ వెళ్ళలేదు. అందుచేత సదాశివం అధ్యక్ష స్థానానికి పనికిరాడని సభవారికి మనవిచేస్తున్నాను." అంటూ సుబ్బులు ముచ్చెమటలూ పోసేలా బల్ల గుద్ది వక్కాణించాడు. "అయినా సదాశివం ఏదైనా అవసరంవస్తే కుర్చీలోంచి కదలలేడు. వాడు ఆ పదవికి పనికిరాడు" సపోర్టిచ్చాడు చలమయ్య.

సభవారందరూ వీరి వాదనను అంగీకరించారు. ఈ సభకు అధ్యక్షుడు అనవసరం అన్నారు అంతా. సదాశివం అల్లానే కూర్చున్నాడు. సుబ్బులూ, చలమయ్యా విజయగర్వంతో తలకాయలు నిలదీసి మరీ కూర్చొన్నారు. శంకరం చేసేది లేక తిరిగి ఉపన్యాసం మొదలెట్టాడు. "సభికులారా! ఈనాటి

మన అత్యవసర సమావేశంలో, ధనం అనే పదార్థం మనకెంత అవసరమో నిరూపించి, దానిని చేకూర్చుకొనే ఉపాయం కోసం అన్వేషించడమే మన ప్రథమ కర్తవ్యం. డబ్బులేనివాడికి సంఘంలో విలువలేదు. ఏ ఎలక్షన్లో నిలబడినా, ఏ ఉద్యోగానికి ధరఖాస్తుపెట్టినా, ఏపని తలపెట్టినా, ధనవంతుడిదే విజయం. మనం అంతా ధనం సంపాదించడానికి ఓ మార్గం దొరికిందినాకు."

"ఏమిటది?"

"ఏముంది? మనమందరం ప్రతీనెలా తలో ఐదు రూపాయలూ వేసుకొని ఒక చిన్న బిజినెస్ స్టార్ట్ చేస్తే నెలకు ప్రతీవాడికీ ఎల్లా లేదన్నా నాలుగైదు రూపాయలు వస్తాయి. ఆ వచ్చిన సొమ్మును మనం వాడుకోకుండా బిజినెస్‌లోనే పెట్టేస్తే ఇంకా డబ్బొస్తుంది. అలా మనం కొద్ది సంవత్సరాలలో లక్షాధికారులం అయిపోవడానికి తగిన సావకాశం ఏర్పడుతుంది. ఈ విషయాన్ని అందరూ ఆలోచించి వెంటనే ఒక నిర్ణయానికి వస్తారని ఆశిస్తున్నాను." ముక్తసరిగా ముగించి కూర్చున్నాడు శంకరం.

వక్తలుందరం ఒకరిముఖాలొకరు చూసుకొంటూ కూర్చొన్నాం. పిడుగులా లేచాడు సుబ్బులు.

"అసంభవం. మనం వ్యాపారం మొదలెడితే మొదటికే మోసం. పెట్టుబడి కాస్తా హరించిపోతుంది. ప్రతినెలా అప్పులవాళ్ళ సంఖ్య ఇంకా పెరిగిపోతుంది. అయినా మనకు వ్యాపారం చెయ్యటానికి వ్యవధి చాలదు. అందుచేత ఈ తీర్మానాన్ని త్రోసిపుచ్చి, నేను ప్రవేశపెట్టే తీర్మానాన్ని ఆమోదించవలసిందిగా సభవార్ని కోరుతున్నాను. నేను బి ఏ. చదువుకొనేటప్పుడు మా మాష్టారు 'ఎకనామిక్స్' చెబెతూ 'ధనం అనేది అన్ని పదార్థాల ప్రతినిధి' అన్నారు. అందుచేత మనమందరం సమ్మెచేసి, బజార్లో వ్యాపారంచేసే ప్రతివాడినీ, వాడి వస్తువుల ధర తగ్గించమని, లేకపోతే ఇంక మేం కొనేది లేదనిన్నీ గట్టిగా చెప్పి వస్తువుల ధరలు తగ్గించుకోవాలి. అన్ని వస్తువుల ధరలూ తగ్గితే ధనం విలువ పెరిగినట్లు. అదీగాక మనకు జీతాలు చాలవని అధికారులపై ఒత్తిడి కలుగజెయ్యాలి." అంటూ సుబ్బులు ఉపన్యాసం ముగించి కూర్చోబోయాడు. కాని అక్కడ కుర్చీ లేక క్రిందపడ్డాడు. అందరూ నవ్వుతుంటే సుబ్బులు కొంచెం సిగ్గుపడి చేసేదిలేక భయపడుతూనే వెళ్ళి సదాశివం కుర్చీలో కూర్చొన్నాడు.

దామోదరం అనే వ్యక్తి తన కుర్చీలోంచి లేచి, ఉపన్యాసం ఇద్దామనే సదుద్దేశ్యంతో నిలబడి, నోట మాటరాక, ఒళ్లు చెమ్మగిల్లి, శరీరం కంపించి, మాట్లాడలేక కూర్చొన్నాడు. సభికులంతా అతనివైపు జాలిగా చూశారు.

ఎదుటివాడికి అపజయం కలగటంకూడా తనకు జయం కలగటమేనన్న ధోరణిలో కాలరు పైకెత్తి నిలబడ్డాడు చలమయ్య. చలమయ్య పోజు చూస్తే ఈ సమస్యనంతనీ తీర్చే వీరాగ్రేసరుడిలావున్నాడు. ఏం చెబుతాడో చూద్దామని సభ్యులందరం చూస్తున్నాం. ఇంతలో వాడు టీ కెటిల్ గాజు గ్లాసులోకి వంచాడు. కాని అందులో టీ ఉంటేగా?

"ధనాభావ పీడిత సోదరులారా...ఇందులో టీ లేదు..."ఇటూ అటూ చూశాడు చలమయ్య. అందరూ జేబులు తడిమిచూశారు, వాళ్ళకేమీ దొరకలేదు. చలమయ్య తన జేబువైపు చేతినిసారించాడు. కాని అతనికి (కొత్తఫేషన్) జేబే లేదు!

"అబ్బ! గట్టిగా మాట్లాడుదామనుకొంటే ఇంతే! పోనీ ఓ అణా పారెయ్యరా సదాశివం. టీ తెప్పించుకొంటాను" అంటూ సదాశివంవైపు జాలిగా చూశాడు చలమయ్య.

"లాభంలేదురా అబ్బాయ్! నా జేబులో రెండణాలేవుంది. ఇంటావిడకి పువ్వులుపట్టుకెళ్ళాలి. అయినా వృత్తి గోడవెందుకుగాని, ఏదైనా మాట్లాడగలిగితే మాట్లాడు; లేకపోతే నోరు మూసుకొని కూర్చో" అన్నాడు సదాశివం కుర్చీలోంచి కదలకుండానే.

అణా ఖర్చుపెట్టక్కర్లేకుండానే టీ తాగిన దానికన్న ఎక్కువ ఆవేశం కలిగింది మా చలమయ్యకు. ముఖం కమ్యూనిస్టు కలర్ ధరించింది. ఇటూఅటూ తేరిపారి చూశాడు, "సోదరులారా! మన సంఘంలో స్వార్థమనేది పెరిగింది. ఎవడి బాగు వాడు చూసుకోవటంలో సంఘం పాడవుతోంది. అంటే పునాదినే పైకి లేవనెత్తేస్తున్నామన్నమాట. సంఘంలో ఇలాంటి స్వార్థపరులకు

స్థానముండకూడదు. అది అలా పెట్టండి. ఈనాటి ఉపన్యాసాలలో నాకు ఒక్కటీ నచ్చలేదు. శంకరం బిజినెస్ స్టార్టు చెయ్యమన్నాడు. బిజినెస్ పెట్టిన రోజునే మనం ఐ. పి. కూడా పెట్టాలి. పోతే సుబ్బులు తన ఎకనామిక్స్ తెలివినంతనీ ఇక్కడ మన ముందర ప్రదర్శిస్తా మనుకున్నాడు. మనం కొనకపోతే షావుకారుకు పోయేదేమీలేదు. పోనీ ఇటుచూస్తే జీతాలు పెంచటంకోసం మనం తెచ్చే ఆలజడి నిరర్థకం. అందుచేత ఇంకోరకమైన ఉపాయం, సరికొత్తది—అంటే నిన్నరాత్రి తయారు చేసినది—నాదగ్గర వుంది. అదేమిటంటే మనమందరం కళాపోషణ చేసి డబ్బు సంపాదించాలి. అటు మన కళ పోషించబడాలి. ఇటు మన జేబులు నిండాలి. మన సుందరం మంచి బొమ్మలు గీస్తాడు. ఆ శంకరంగాడు ఓ మాదిరిగా పాటలు పాడుతాడు నేను నాటకాల్లో వేషాలేస్తాను. మనందరం ఊరూరా తిరిగి మన కళావిశిష్టతను అందరికీ తెలియబరిస్తే మనకు కావలసినంత డబ్బు! అయినా ఇంకా సుబ్బారావున్నాడుగా మాట్లాడటానికి!" అంటూ నావైపు చూస్తూ కుర్చీ జాగ్రత్తగా ఉందో లేదో తడిమిచూసుకొని కూర్చున్నాడు చలమయ్య.

మంత్రాలకన్న తుంపర్లెక్కువట. ఆలా వుంది మనవాడి ఉపన్యాసం. మాకెవ్వడికీ వాడి తీర్మానం నచ్చలేదు. ఊరూరా అనాధులు తిరిగినట్లు తిరిగితే ఉన్న గౌరవం కాస్తా ఊడిపోతుందనుకొన్నారు అంతా.

"సోదరులారా! ధనం సంపాదించడానికి మానవ ప్రయత్నం చాలదు. అదృష్టం కలిసిరావాలి. ఈనాడు మనందరం ఇక్కడ కూడుకొన్నాం. మనలో ఏ ఒక్కడు - దృష్టవంతుడున్నా మన కందరికీ కావలసినంత డబ్బు. నేను పజిల్స్ పూర్తి చెయ్యడంలో కొంత అనుభవం సంపాదించాను. మనమందరం ఇప్పుడే తలో ఎంట్రీ పూర్తిచేద్దాం." అంటూ డ్రాయర్లోంచి ఎంట్రీలుతీసి చూపించాను. అందరూ ఆమోదించారు. పూర్తిచేసి డబ్బుకోసం చూస్తే ఎవరిదగ్గరాలేదు. మాలో కాస్త డబ్బున్న వాడు సదాశివం. వాడు "నన్ను మాత్రం డబ్బడక్కండి. నాకు ఏమీవద్దు" అన్నాడు. చేసేదిలేక ఇంట్లోకెళ్ళి పండక్కి చీరకొనుక్కోమని ఇచ్చిన బొపతు ఐదురూపాయలు తీసుకొని, ఎంట్రీలు టపాపెట్టెలో పడేసి, అందరం విడిపోయాం. "వచ్చే ఆదివారం వస్తాం. లాభం అందరం సమానంగా పంచుకోవాలి" అంటూ అందరూ వెళ్ళి పోయారు. "నాకుమాత్రం ఏమీ వద్దురోయ్" అంటూ సదాశివం పెద్ద ఏనుగులాగ కదులుతూ వెళ్ళిపోయాడు.

సదాశివంయొక్క అమాయకత్వానికి నవ్వుకొంటూ వీధితలుపువేసి లోపలకు వెళ్ళిపోయాను.

* * *

అనుకొన్న ప్రకారంగా శుక్రవారం పేపర్లో కరెక్టు ఎంట్రీ పడింది. అరే! అచ్చూమచ్చూ నా ఎంట్రీనే. నాకు ఒకతప్పులేదు! ఆల్ కరెక్ట్! 50 వేల రూపాయలు కొట్టేసినట్లే! భావాలు పరుగెడుతుంటే, చేతిలో పేపరు రెపరెపలాడుతుంటే అర్థాంగి వచ్చి అడిగింది "ఏమిటా సంతోషం!" అంటూ. జరిగినదంతా చెప్పేశాను. సంతోషంలో ఇంకేమీ కనుపించలేదు.

"డబ్బొస్తే వాళ్ళూ వాటాకొస్తారు. ఈపూటే బజారుకెళ్ళి అన్నీ కొనుక్కొద్దాం" అంది మా లలిత క్రీగంటచూస్తూ.

బజారులో మాకు అరువిచ్చే షావుకారు వద్దకు వెళ్ళి సిల్కుచీరలు, రవికల గుడ్డలూ, నాకు వులెన్ సూట్లూ, పిల్లలకు మంచిమంచి ఆటవస్తువులు, వెండిసామానులు, అన్నీ పుచ్చుకొని ఇంటికివచ్చాం. సైకిల్ కు, రేడియోకు రెండువందలు బజానా ఇచ్చాం.

ఆ నాడు గడిచింది. తెల్లవారింది. పదిగంటలకు పోస్టుమేన్ ఉత్తరంఇచ్చాడు."50వేలరూపాయలు 500 మందికి పంచగా మీకు 100 రూపాయలు వచ్చింది." ప్రాణం గతుక్కుమంది.

అంతక్రితమే ఇల్లుకడదామనుకొంటున్న మా మామయ్యకీవార్త తెలిసి "ఇంకెంత మిగిలింది?" అంటూ రాగా, "రెండువేలు అప్పు మిగిలింది" అంటూ సమాధానిస్తూండగా "ఆశకు నిరాశే మొగుడురా అబ్బాయీ!" అంటూ సదాశివం వీపుమీద తట్టాడు.